సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

'పిల్లలు పనిలో కాదు, బడిలో ఉండాలి'



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సమగ్ర శిక్ష డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గీత

కొమ్మాది: పిల్లలు పనికాదు, బడిలో ఉండి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఎసమగ్ర శిక్ష డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ గీత అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ, కె.నగరపాలెం ప్రాంతాల్లో పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను బడికి పంపించాలని వివరించారు. పిల్లలను భవిత స్కూల్ పంపడం వలన ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, హోమ్‌బేస్డ్ అలవెన్సులు ఇస్తామని తెలిపారు. ఇప్పటివరకు భీమలి మండలంలో 47 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఈఓ శివరాణి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



వివిధ రాజకీయ పక్షాల నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ సునీల్

తగరపువలస: భీమిలిని ప్రశాంతంగా ఉంచడానికి ప్రతి ఒక్క నాయకుడు తమతో సహకరించాలని మధురవాడ జోన్ ఏసీపీ బి.సునీల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చెరకుపల్లి అవంతి కళాశాల ఎదురుగా గల ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన భీమిలి అర్బన్, రూరల్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులతో శాంతి భద్రతల పరిరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడా ఐదుగురికి మించి గుమిగూడి ఉంటే లాఠీలకు పనిచెప్పక తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా 3,4,5,6వ తేదీల్లో ఊరేగింపులు, బాణసంచా కాల్పులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు పది రోజుల ముందు భీమిలి మండలం తాళ్లవలసలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు మాయనిమచ్చగా మిగిలిపోయిందన్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 10 మందిని రిమాండ్‌కు పంపించామన్నరాఉ. కౌంటింగ్ రోజు ఎలాంటి గొడవలు తలెత్తకుండా భీమిలిలో ఏసీపీతో పాటు సెంట్రల్ ఫోర్స్‌తో రక్షణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎస్ఐలు గంటా హరీష్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

హీట్ స్ట్రోక్‌తో పశువుల మృతి

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో అంతుచిక్కని వ్యాధులతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈ వారంలో రెండు పశువులు వెనుక కాళ్లు పడిపోయి వెంటనే మృతి చెందాయి. ఇలాంటి సమస్యతోనే మరో గోవు పరిస్థితి విషమంగా ఉంది. ఈ వ్యాధి సోకిన పశువుల కోసం రైతులు రెండు వారాలలో రూ.6 వేలు వంతున ఖర్చు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. దీనిపై దాకమర్రి పశువైద్యశాల వైద్యుడు జి.క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు హీట్ స్ట్రోక్‌కు గురవుతున్నాయన్నారు. ముఖ్యంగా అధిక పాలదిగుబడి ఇచ్చే హైబ్రీడ్ పశువులు మన ఉష్ణోగ్రతలను తట్టుకోలేకపోతున్నాయన్నారు. పాడిరైతులు పశువులకు నీళ్ల కుండీలు అందుబాటులో ఉంచడం, స్ప్రింకర్లు, పరదాలు, గాలి తగలడం, కమ్మలతో పాకలు నిర్మించి వేడి నుంచి ఉపశమనం కల్పించాలన్నారు.

శివానంద నియామకంపై హర్షం

తగరపువలస: చిట్టివలసకు చెందిన పత్రి శివానంద కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన సందర్భంగా శుక్రవారం స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికుడైన అప్పలరాజు కుమారుడు శివానంద చిట్టివలస జెడ్పీహైస్కూల్, భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ప్రస్తుతం ఎముకల వైద్య నిపుణుడైన శివానంద సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఆయన సేవలు పేదప్రజలకు అందాలని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, కాళ్ల శ్రీనివాస్ తదితరులు ఆకాంక్షించారు.

తగరపువలస నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లేందుకు అనువుగా లేని వెంకటేశ్వరమెట్ట వద్ద జాతీయ రహదారి





వరదలకు కొట్టుకుపోయిన వంతెన పిల్లర్లు (ఫైల్)

వంతెన నిర్మిస్తే రాకపోకలకు సుగమం



శిథిల వంతెన వద్ద మిగిలిన అప్రోచ్ రోడ్డు

తగరపువలస: తగరపువలస కూడలి నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు నేరుగా మార్గాలు లేవు. ముందుగా తగరపువలసలోనే రెండు మూడుసార్లు ప్రదక్షిణ చేస్తే తప్ప జాతీయరహదారిపైకి చేరలేరు. అంతెందుకు భీమిలి మండలంలోని చిప్పాడ, పద్మనాభం మండలాల వైపు వెళ్లాలన్నా ఈ తిప్పలు తప్పడం లేదు. ముందుగా వేంకటేశ్వరమెట్ట వద్దకు వచ్చి తిరిగి వెనక్కి రామన్నపేట లేదా వైఎస్సార్ సర్కిల్ వరకు సర్వీస్ రోడ్డులో ప్రయాణించి అండర్ పాస్‌ల ద్వారా మరో సర్వీస్‌రోడ్డుకు రావాలి.

అక్కడి నుంచి విజయనగరం జిల్లాలోని మహారాజుపేట కూడలికి చేరితే కాని భీమిలి, పద్మనాభం మండలాలు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోకి ప్రవేశించలేరు. అలాగే విశాఖ వైపు నుంచి తగరపువలస వచ్చేవారు ఆనందపురం మండలం వెల్లంకి వద్ద సర్వీస్‌రోడ్డుపైకి దిగకపోతే నేరుగా విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి వెళ్లి వెనక్కు రావలసి ఉంటుంది. జాతీయరహదారుల నిర్మాణంలో లోపాలను గత ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో తగరపువలస గుర్తింపు మనుగడకే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. తగరపువలస వాసులు ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో ప్రయాణించాలన్నా ఊరి చివరకు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లవలసి వస్తోంది.

గతంలో తగరపువలస కూడలి మీదుగా ప్రయాణించే వాహనాలు గోస్తనీనదిపై బంగ్లామెట్ట నుంచి చెరకుపల్లి వరకు ఉండే వందేళ్ల చరిత్ర కలిగిన గ్రావెల్‌తో నిర్మించిన వంతెనపై ప్రయాణించేవి. 1990లో తుఫాను సందర్భంగా పెద్ద చెట్లు నదిలో కొట్టుకు వచ్చినప్పుడు ఈ పాత వంతెనకు అడ్డం పడటంతో ఒక పిల్లర్ కొట్టుకుపోయింది. తరువాత కాలంలో వరదలకు మిగిలిన పిల్లర్లు కొట్టుకుపోయినా రెండు చివర్ల అప్రోచ్‌రోడ్లు, వంతెనల ఆనవాళ్లు మిగిలే ఉన్నాయి. **ఇటీవల జాతీయరహదారుల విస్తరణ పనుల వలన జరిగిన లోపాలను ఈ శిథిల వంతెనను పునరుద్ధరించడం ద్వారా అధిగమించవచ్చని స్థానికులు వాహనదారులు అంటున్నారు. సుమారు 120 మీటర్లు దూరం ఉన్న ఈ** వంతెనను పునరుద్ధరిస్తే తగరపువలస చుట్టూ ప్రదక్షిణ చేసే పని లేకుండా నేరుగా వాహనాలు ఈ రెండు జిల్లాలలోకి చేరుకోవచ్చని అంటున్నారు. అలాగే బంగ్లామెట్ట వద్ద నిర్మించనున్న ఆర్టీసీ కాంప్లెక్స్ కారణంగా కూడా ఈ ప్రతిపాదిత వంతెన దోహదపడుతుందని అంటున్నారు.



గోస్తనీనదిని దాటడానికి ఇరు జిల్లాల ప్రజలు వినియోగిస్తున్న గట్టు

వంతెన పునర్‌నిర్మాణం అవసరం



బంగ్లామెట్ట వద్ద గోస్తనీ నదిపై వంతెన పునర్‌నిర్మాణం అత్యవసరం. అప్పుడు ఆర్టీసీ బస్సులన్నీ తగరపువలస ఊరిలో నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. ప్రయాణికులకు, వాహనారులకు సౌలభ్యంగా ఉంటుంది.

–చిల్ల రంగారెడ్డి, చిల్లపేట

భీమిలి మండలాలకు దూరం తగ్గుతుంది



గోస్తనీనదిపై 35 ఏళ్ల క్రితం శిథిలమైన వంతెన ప్రదేశంలో మరో వంతెన నిర్మిస్తే భీమిలి మండలాలకు రాకపోకలు చేసే వారికి దూరం తగ్గుతుంది. ప్రస్తుతం ఈ మార్గం లేకపోడం, వేంకటేశ్వరమెట్ట వద్ద అవకాశం లేకపోవడంతో పక్క జిల్లాలకు వెళ్లి వెనక్కు రావలసి వస్తుంది.

–చిల్ల అప్పలసూరిరెడ్డి, మూలకుద్దు

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి **సహిత శ్రీ వేంకటేశ్వరస్వా**మి ఆలయంలో శుక్ర**వారం వారాంతపు పూజలు** అత్యంత వైభవంగా **నిర్వహించారు. ముందుగా** శ్రీవారిని ప్రత్యేకంగా **అలంకరించేందుకు శేషవస్త్రం**, అభిషేక సామాగ్రిను **ప్రదక్షణగా మంగళవాయిద్యా**ల నడుమ తీసుకు **వెళ్లి అభిషేకాలు నిర్వహించి**, ప్రత్యేకంగా అలంక**రించారు. అనంతరం భక్తు**లకు దర్శనం కల్పిం**చారు. ఈ కార్యక్రమంలో** వేద పండితులు, అర్చ**కులు, ఆలయ అధికారులు** పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సాయంతో భీమిలి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తగరపువలస మెయిన్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. కొంతకాలంగా మెయిన్‌రోడ్డులోని ఇరువైపులా ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకోవడం, అలాగే తమ దుకాణాల ముందు స్థలాలను చిరువ్యాపారులకు అద్దెకు ఇవ్వడం వంటి సంఘటనల కారణంగా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ మేరకు ప్రజల నుంచి నిత్యం నిరసనలు వెల్లువెత్తుతుండటంతో ఎట్టకేలకు స్పందించారు. ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు బి.రేష్మ, డి.సాయిగోపాల్ సంయుక్తంగా ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో అభయాంజనేయ స్వామి ఆలయాలను శనివారం జరిగే హనుమజ్జయంతికి ఏర్పాట్లు చేశారు. కృష్ణాపురం, పద్మనాభం, మద్ది జంక్షన్, ఐనకలపాలెం, తునివలస, రేవిడి, కోరాడ, తునిపాలెం, అనంతవరం, పాండ్రంగి, కురపల్లి గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాలకు రంగులు వేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

భీమునిపట్నం: భీమిలిలోని శ్రీసీతారామ లక్ష్మణ సహిత శ్రీదాసాంజనేయ స్వామివారి ఆలయం వద్ద శనివారం హనుమత్ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 108 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజ పంచామృత, ఫలరస, సుగంధ జలాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం భక్తులకు నారాయణ సేవ కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం హనుమాన్ చాలీసా, హనుమత్ వైభవం పురాణ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మధురవాడ: హనుమజ్జయంతి ఉత్సవాలకు మధురవాడలోని పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఆయా ఆలయ కమిటీలు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, మధురవాడ సిద్దేశ్వర స్వామి పీఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్టు ఆయా ఆలయ కమిటీలు తెలిపాయి.



కృష్ణాపురంలోని అభయాంజనేయ స్వామి ఆలయం

రామాద్రి హంసవన పుణ్యక్షేత్రంలో

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి రామాద్రి హంసవన పుణ్యక్షేత్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9వరకు పంచామృతాభిషేకాలు, సహస్ర సింధూరం, తమలపాకుల పూజ, సాయంత్రం 5 గంటల నుంచి 6 వరకు హనుమాన్‌చాలీసా, పారాయణం, 6.30 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. 'పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం, జయంతి 20 ఏళ్ల తరవాత ఒకే రోజు (శనివారం) వచ్చాయి. దీంతో ప్రాధాన్యత సంతరించుకుంది. 2004 జూన్ ఒకటిన ఈ ఉత్సవాలు ఒకేసారి వచ్చాయి. మళ్లీ ఇప్పుడు ఈ రెండు ఉత్సవాలు ఒకేసారి వచ్చాయి. దీంతో ఈ రెండు ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి ఆలయంలో భజన ప్రారంభించారు.



సిద్దేశ్వర స్వామి పీఠంలో పూజలకు సిద్ధం అయిన పంచముఖ ఆంజనేయ స్వామి

పద్మనాభం: మండలంలోని మద్ది జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం, జయంతి 20 ఏళ్ల తరవాత ఒకే రోజు (శనివారం) వచ్చాయి. దీంతో ప్రాధాన్యత సంతరించుకుంది. 2004 జూన్ ఒకటిన ఈ ఉత్సవాలు ఒకేసారి వచ్చాయి. మళ్లీ ఇప్పుడు ఈ రెండు ఉత్సవాలు ఒకేసారి వచ్చాయి. దీంతో ఈ రెండు ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి ఆలయంలో భజన ప్రారంభించారు.

ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం భీమిలిలోని తన క్యాంపు కార్యాలయంలో బూత్ ఏజెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించబోతోందని అన్ని సర్వేలు ఇదే చెబుతున్నాయన్నారు. భీమిలిలో తాను మంచి మెజార్టీతో గెలవనున్నానని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన అందరికీ ముందుగానే శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం విశాఖలో చేయడం ఖాయమని అన్నారు. కౌంటింగ్ సమయంలో మన ప్రత్యర్థులు తప్పుడు ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా నిత్యం పరిశీలించాలని ఏదైనా ఇబ్బందులు ఉండే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

అసాంఘిక శక్తులపై నిరంతం నిఘా

- డీసీపీ 1 లక్ష్మీనారాయణ, ఏసీపీ సునీల్
- మధురవాడ వాంబేకాలనీలో కార్డెన్ సెర్చ్
- పత్రాలు లేని 25 వాహనాల సీజ్



వాంబేకాలనీలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణ



వాంబేకాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మధురవాడ: అసాంఘిక శక్తులతో పాటు అసాంఘిక కార్యకలాపాలుపై నిరంతరం నిఘా ఉంచుతామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ 1 లక్ష్మీనారాయణ చెప్పారు. మధురవాడ వాంబేకాలనీలో శుక్రవారం వేకువ జాము 3 గంటలు నుంచే కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. చీకటి తొలగక ముందే అనుకోకుండా పోలీసులు ఇళ్లకు వచ్చి తనిఖీలు చేపట్టడంపై కొందరు ఆందోళనకు కూడా గురయ్యారు. ఈ సందర్భంగా విశాఖ నార్త్ జోన్ ఏసీపీ బి. సునీల్ మాట్లాడుతూ జూన్ 4న కౌటింగ్ కారణంగా పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లో రోజూ తనిఖీలు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. జూన్ 3,4,5 తేదీల్లో అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆ మూడు రోజులూ ఎక్కడా మద్యం అమ్మకూడదన్నారు. ముఖ్యంగా గంజాయి, మద్యం లాంటి ఎక్కడా లేకుండా చూడడమే ప్రధాన లక్ష్యం అని చెప్పారు. పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మల్లయ్యపాలెం, ఎండాడ, మారికవలస, ఆర్‌హెచ్ కాలనీ, వాంబేకాలనీ తదితర ఐదు క్రిటికల్ ప్రాంతాలుగా గుర్తించామన్నారు. కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో 45 మంది పోలీసులు జల్లెడ పట్టడంతో పాటు వాహనాలు కూడా తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేని 25 వాహనాలు సీజ్ చేశారు. కార్యక్రమంలో పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న లారీల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: పద్మనాభం మండలంలో అనధికారంగా మట్టి తరలిస్తున్న మూడు లారీలను జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు గురువారం రాత్రి పట్టుకుని పద్మనాభం పోలీసులకు అప్పగించారు. 'యథేచ్ఛగా మట్టి దందా' శీర్షికతో గత నెల 28న సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పట్టుకున్న లారీల యజమానుల నుంచి పద్మనాభం రెవెన్యూ అధికారులు రూ.6,200 వంతున జరిమానా వసూలు చేసి విడిచి పెట్టారు. అనంతరం యథావిధిగా మండలంలోని పలు పంచాయతీల్లోని వ్యవసాయ భూముల నుంచి మట్టి తరలింపు సాగుతోందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మైనింగ్ అధికారులు అనుమతులు లేకుండా మట్టి తరలింపునకు రెవెన్యూ అధికారులతో పాటు పద్మనాభం పోలీస్ స్టేషన్‌లోని ఒక కానిస్టేబుల్ చక్రం తిప్పుతున్నట్టు ఆరోపిస్తున్నారు.



మట్టితో పట్టుబడిన లారీలు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



శానిటరీ ప్యాడ్స్ అందజేస్తున్న డాక్టర్ ఊహ మహంతి

కొమ్మాది: యుక్త వయస్సులో బాలికలు, మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ఊహా మహంతి అన్నారు. శుక్రవారం మారికవలస, ఎండాడ ప్రాంతాల్లో రుతుపరిశుభ్రత వారోత్సవాలు ముగింపు సందర్భంగా సంభవించే వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి ఎలా తప్పించుకోవాలో మహిళలకు వివరించారు. అనంతరం శానిటరీ ప్యాడ్స్ అందజేశారు.

ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసుల నమోదు

పీఎంపాలెం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు యువతలు అదృశ్యంపై కేసులు నమోదయ్యాయి. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది సేవానగర్‌లోని బ్లాక్ నంబరు 23లో పురుషోత్తమ అభిరామరాజు ఆరేళ్లుగా కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని చెల్లెలు సత్య జ్యోతి(18) తన స్వస్థలం రాజమండ్రి గోకవరం నుంచి నెల రోజులు కిందట సేవానగర్‌కు వచ్చింది. గత నెల 28వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగిరాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొమ్మాది వైఎస్సార్ కాలనీలో...

కొమ్మాది వైఎస్సార్ కాలనీలో బ్లాకు నంబరు 22 జీఎఫ్–2లో నాగోతి వెంకటరమణ కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని కుమార్తె భారతి మణి (25) హైదరాబాద్‌లోని అవినాష్‌తో 2020లో వివాహం చేశారు. అప్పటినుంచి హైదరాబాద్‌లోనే ఉంటోంది. తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో గత నెల 9వ తేదీన పుట్టింటికి వచ్చింది. గత నెల 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మార్కెట్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పట్ల గాలించినా ఫలితం లేక పోవడంతో యువతి తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



సత్యజ్యోతి (ఫైల్)



భారతీమణి (ఫైల్)

నేటి నుంచి షిర్డీసాయి, పార్వతమ్మ ఆలయాల వార్షికోత్సవం

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని షిర్డీసాయి, పార్వతమ్మ ఆలయాల 20వ వార్షికోత్సవం శనివారం నుంచి మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు తెలిపారు. శని,ఆదివారాల్లో విఘ్నేశ్వర పూజ, పరిషత్, మండపారాధన, అభిషేకాలు, కుంకుమార్చ, కర్పూర హారతి వంటి పూజాది కార్యక్రమాలు జరగుతాయని తెలిపారు. మూడో తేదీ మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బడ్డీల తొలగింపుతో ఆందోళన



ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు

మధురవాడ: జీవీఎంసీ అధికారులు ఉన్న ఫళంగా రోడ్డు మార్జిన్‌లలో ఉన్న బడ్డీలు, తోపుడు బళ్లను తొలగించడంతో శుక్రవారం చిరు వ్యాపారులు ఆందోళన నిర్వహించారు. పీఎంపాలెం 2వ బస్టాప్ సమీపంలో మాస్టర్ ప్లాన్ రోడ్డుపై వైఎస్సార్‌సీపీ 6వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో బైఠాయించి ఆందోళనకు దిగారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే అక్కడకు వచ్చి హామీ ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి చిరు వ్యాపారులు రోడ్డువక్క చిన్న చిన్న బడ్డీలు, తోపుడు బళ్లు ఏర్పాటు చేసుకుని కుటుంభాలను పోషించుకుంటున్నారన్నారు. వీరికి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తోపుడు బండ్లను తొలగించడం అన్యాయమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందును ఆందోళనలు విరమించాలని పోలీసులు సూచించారు. చిరు వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తామని జీవీఎంసీ అధికారులు హామీ ఇవ్వడం ఆందోళన విరమించారు.

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు



గ్రావెల్ తరలిస్తున్న మినీ లారీలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, కె.నగరపాలెం ప్రాంతాల్లో కొండను తవ్వి యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా లారీలు, మినీ వ్యాన్‌లతోనూ మట్టి, రాయను తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రావెల్ తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పలుమార్లు తహసీల్దార్ టి. గోవింద హెచ్చరించినప్పటికి గ్రావెల్ మాఫియా పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఓ రెవెన్యూ అధికారి అండదండలతో ఈ మాఫియా యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తుందని పలువురు అంటున్నారు. దీనిపై తహసీల్దార్ టి. గోవిందను వివరణ కోరగా ఈ ప్రాంతాల్లో గ్రావెల్ తరలింపు వాస్తవమేనన్నారు. వీరిపై చర్యలు తీసుకోమని వీఆర్‌వోలకు ఆదేశించామని చెప్పారు.